సాక్షి
గుంటూరు

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



వెండి బిందె, కిరీటం వితరణ

అచ్చంపేట: స్వయంభు సత్తెమ్మతల్లికి కోటప్పకొండ దేవస్థాన కమిటీ మెంబరు దివ్వెల రామకృష్ణ వెండి బిందె, కొత్త హరినాథబాబు వెండి కిరీటాన్ని విరాళంగా సమర్పించారు.



భావనారుషి కల్యాణం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.



అన్నదానానికి విరాళం

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు రూ.1.00.116 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

రేపు హెల్త్ ఉద్యోగులకు స్పెషల్ గ్రీవెన్స్

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరి వేతన సంబంధిత సమస్యలపై మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. వేతన సంబంధిత సమస్య లున్నవారు డీఎంహెచ్ఓ కార్యాలయంలో పని వేళల్లో లిఖిత పూర్వకంగా తగు ఆధారాలతో డీఎంహెచ్ఓను సంప్రదించాలన్నారు.

మార్చి 6న పాతకోటయ్య మెట్లమార్గానికి భూమిపూజ



నరసరావుపేట: కోటప్పకొండలో పాత కోటయ్య సన్నిధికి చేరేందుకు 3700 మెట్లతో నిర్మించబోయే మెట్ల మార్గానికి మార్చి ఆరో తేదీన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భూమిపూజ నిర్వహిస్తారని మెట్ల మార్గ నిర్మాణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగుల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెట్ల మార్గ కమిటీకి చెందిన 10మంది కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని ఆయన గృహంలో కలిసి భూమిపూజకు ఆహ్వానించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కార్యదర్శిగా ఇండ్ల కోటేశ్వరరావు, కోశాధికారిగా కొత్తూరి గోపి, ఉపాధ్యక్షులుగా తేళ్ల సుధీర్, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, బత్తుల విష్ణు, సంయుక్త కార్యదర్శులుగా తాళ్ల వెంకటకోటిరెడ్డి, చిన్ని శ్రీనివాసరావు, మెంబర్లుగా వేముల వెంకటనారాయణ, దివ్వెల సురేష్‌కుమార్‌లతో నూతన కమిటీ ఏర్పాటైందన్నారు. దాతలు ప్రతి మెట్టుకు రూ.20వేలు చొప్పున ఐదు మెట్లకు రూ.లక్ష చెల్లిస్తే వారి పేరు ఆ మెట్లపై ముద్రిస్తామని తెలిపారు. కావున దాతలు నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హాలీవుడ్ రఘు పాల్గొన్నారు.

తెనాలిలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన

వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మోదీ




తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌కు ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. జిల్లా వైద్యశాలలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు పాల్గొన్నారు. సెకండరీ హెల్త్ విభాగం జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుబ్రమణ్యరాజు, డీఈఈ వెంకటరత్తయ్యలు మాట్లాడుతూ తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం రూ.44.05కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం వెచ్చించినట్లు చెప్పారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి వారికి చికిత్స అందించేందుకు క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, ఏఓ డాక్టర్ మజీదా బేగం, డాక్టర్ మనుమోహన్, డాక్టర్ శ్రావణ్‌బాబు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన

నరసరావుపేట: అమృత భారత్ పథకం కింద గుంటూరు డివిజన్‌లోని 13 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన, పది ఆర్‌యూబీ, అండర్ పాస్‌ల ప్రారంభోత్సవాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని రైల్వే డివిజన్ మేనేజర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేట, మంగళగిరి, సత్తెనపల్లి, నడికుడి, మాచర్ల, మిర్యాలగూడ, నల్గొండ, వినుకొండ, మార్కాపురం రోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల స్టేషన్లలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 516.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 816.20 అడుగుల వద్ద ఉంది.



జాతికి అంకితం

మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)ను ఆదివారం జాతికి అంకితం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పాల్గొన్న కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు ప్రవీణ్ భారతీ పవార్, ప్రహ్లాద్ జోషి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు.



పేదింటి పిల్లలకు కార్పొరేట్ విద్య

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు

- ఫీజులు చెల్లించే బాధ్యత తీసుకున్న ప్రభుత్వం
- విద్యాహక్కుచట్టం ద్వారా ఒకటో తరగతిలో ప్రవేశాలు
- చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్న ప్రభుత్వం
- మార్చి14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు
- గుంటూరు జిల్లాలోని 501 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అందుబాటులో ఐదువేల సీట్లు
- గతేడాది పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించిన ప్రభుత్వం
- అర్హులైన పేద, బడుగు, బలహీన వర్గాలకు పుష్కలంగా సీట్లు
- ఒక్కసారి ఎంపికైతే పైసా ఖర్చులేని ఉచిత పాఠశాల విద్య

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ప్రభుత్వం విద్యాహక్కుచట్టం ద్వారా కార్పొరేట్ పాఠశాలల్లో పైసాఖర్చు లేని ఉచిత విద్యను అందిస్తోంది. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ గత రెండేళ్లుగా ఆయా కుటుంబాలకు చెందిన పిల్లలకు ఫీజులు చెల్లిస్తోంది. తాజాగా 2024–25 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. విద్యాహక్కుచట్టం–2009 ద్వారా నిర్బంధ విద్యను అందించేందుకు జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికై తల్లిదండ్రులు మార్చి 14వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.



విద్యాహక్కుచట్టం ద్వారా ప్రవేశాలు..

పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు పైసా ఖర్చు లేని కార్పొరేట్ విద్య కలను సాకారం చేసిన ప్రభుత్వం వేలాది రూపాయలను వెచ్చించి, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను పొందే స్తోమత లేని నిరుపేదలకు అండగా నిలిచింది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న ధనిక వర్గాల పిల్లలతో సమానంగా పేద పిల్లలు చదువుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా నిర్బంధ విద్యాహక్కుచట్టం అమల్లో భాగంగా బడుగు, బలహీన వర్గాలు ఉచిత విద్యను హక్కుగా పొందుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ–సమగ్రశిక్ష ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశాయి. అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌లు అమలు చేస్తున్న పాఠశాలల్లో విద్యాహక్కుచట్ట ప్రకారం 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంది.

మార్చి 14వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..

http://cse.ap.gov.in ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చిన్నారుల జనన ధ్రువీకరణ పత్రంతో పాటు చిరునామా ధ్రువీకరణకు తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, రేషన్, విద్యుత్ బిల్లు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, రెంటల్ అగ్రిమెంట్ కాపీలలో ఏదైనా ఒకటి జతపర్చాలి. టోల్ ఫ్రీం నంబరు: 18004258599 ద్వారా ఇతర వివరాలు తెలుసుకోవచ్చు. గ్రామ, వార్డు సచివాలయంలోనూ ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. మార్చి 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించిన తరువాత గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అనంతరం అర్హులైన విద్యార్థుల జాబితా తయారు చేసి విద్యాశాఖకు పంపుతారు. అర్హులైన విద్యార్థులకు లాటరీ పద్ధతిలో సీట్లను కేటాయించనున్నారు.

పైసా ఖర్చులేకుండా..

పేద విద్యార్థులకు పైసా ఖర్చులేని ఉచిత విద్య అందించేందుకు విద్యాహక్కుచట్టం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాల్సి ఉంది. పిల్లల చదువులకు వేలాది రూపాయలను వెచ్చించలేని నిరుపేద, బడుగు, బలహీన వర్గాలు ప్రభుత్వం కల్పిస్తున్న సదవకాశాన్ని అందిపుచ్చుకోవాలని విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు. విద్యాహక్కుచట్టం ద్వారా ఒక్కసారి ఎంపికైన విద్యార్థులు పాఠశాల విద్య ముగిసేవరకు పైసా ఖర్చులేని ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువమంది తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఆన్‌లైన్‌లో 975 దరఖాస్తులు రావడంతో వాటిలో అర్హులైన విద్యార్థులకు సీట్లు కేటాయించారు.

జిల్లాలో 5వేల సీట్లు...

విద్యాహక్కుచట్టం కింద ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించేందుకు గుంటూరు జిల్లావ్యాప్తంగా 501 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలతో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నాయి. వీటిలో 5వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఇదేవిధంగా ప్రవేశం పొందిన విద్యార్థులు వచ్చే విద్యాసంవత్సరానికి రెండో తరగతిలోకి వెళ్లనున్నారు.

పేద కుటుంబాల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి



విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య సదుపాయాన్ని పేద కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలి. పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాల్లోని పిల్లలకు పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్య అందించేందుకు అర్హులైన వారికి ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ఎక్కువ మంది ప్రయోజనం పొందేలా క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాం

– జి.విజయలక్ష్మి, ఏపీసీ, సమగ్రశిక్ష, గుంటూరు

దుర్గమ్మ సన్నిధిలో విద్యార్థుల సందడి



హాల్ టికెట్లను అమ్మవారికి చూపుతున్న ఇంటర్ విద్యార్థులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. మరో నాలుగు రోజులలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థుల వార్షిక పరీక్షల నేపథ్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తమ పరీక్ష హాల్ టికెట్లను అమ్మవారికి చూపి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా దీవించమని వేడుకున్నారు. మరో వైపున నవ వధూవరులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల తాకిడి కనిపించింది. ఆదివారం కావడంతో అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమాలలో విశేషంగా ఉభయదాతలు పాల్గొన్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్ రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ300, రూ.500 టికెట్ల క్యూలైన్ల ద్వారా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు, ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–2 రాత పరీక్ష



గుంటూరు ఏసీ కళాశాల కేంద్రం వద్ద పరీక్ష రాసేందుకు వేచిఉన్న అభ్యర్థులు



గుంటూరు ఏసీ కళాశాల కేంద్రంలో అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

- 23,334 మంది అభ్యర్థులు హాజరు
- కేంద్రాల వద్ద కట్టుదిట్టంగా పోలీస్ బందోబస్తు

నగరంపాలెం: ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–2 ప్రిలిమ్స్ రాత పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 56 సెంటర్లను ఏర్పాటు చేయగా, ఉదయం 9.30 నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 28,209 మంది హాజరుకావాల్సి ఉండగా, 23,334 (82.7 శాతం) మంది అభ్యర్థులు హాజరవ్వగా, 4,875 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద, పరిసరాల్లో పోలీస్ బందోబస్తు కట్టుదిట్టం చేశారు. 250 మంది పోలీస్ అధికార, సిబ్బంది విధులు నిర్వహించారు. 14 మార్గాల్లో సాయుధ ఎస్కార్ట్ సిబ్బందిని కేటాయించగా ప్రశ్నపత్రాలను సులభతరంగా తరలించారు.

కలెక్టర్, జేసీ, ఎస్పీల పర్యటన..

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి గుంటూరు నగరంలోని టీజేపీఎస్ కళాశాలను, జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి వట్టిచెరుకూరు మండలంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల, చౌడవరంలోని ఆర్వీఆర్/జేసీ కళాశాల, ఆంధ్రా ముస్లిం కళాశాలను, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఏసీ కళాశాల, వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వ విద్యాలయాల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. ఏయే పరీక్షా కేంద్రాలలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నారు, వారికి అవసరమైన తాగునీరు, ఇతరత్రా సదుపాయాలపై అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూంకు తరలించి, అక్కడ భద్రతను పర్యవేక్షించారు.

ఉపయోగపడిన హెల్ప్‌డెస్క్‌లు..

దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్ష కేంద్రాల చిరునామా, రూట్ ఇతరత్రా వివరాలు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లు ఎంతగానో ఉపయోగపడ్డాయి. గుంటూరు రైల్వే స్టేషన్ తూర్పు / పశ్చిమ వైపు ద్వారాల వద్ద, గుంటూరు ఆర్టీసీ బస్టాండ్, హిందూ కళాశాల జంక్షన్ల వద్ద పోలీస్ హెల్ప్ డెస్క్‌ల వద్ద అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక అందుబాటులో ఉన్న డయల్–100, 8688831568, 8688831392 నంబర్లకు సైతం కొందరు అభ్యర్థులు కాల్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



కల్యాణమూర్తులకు వసంతోత్సవం

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఉదయం కల్యాణమూర్తులకు వసంతోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆలయ సమీపంలోని చెరువులో అవభృందోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ప్రత్యేక పల్లకిలో స్వామివార్లను ఊరేగించారు. సాయంత్రం ధ్వజారోహణ చేసి, యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. రాత్రికి కల్యాణమూర్తులకు పుష్పాభిషేకం చేశారు. పవళింపుసేవతో ఉత్సవాలకు ముగింపు పలికారు. అనంతవరానికి చెందిన కుప్పా రామగోపాల సోమయాజీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. శనివారం రాత్రి కల్యాణమూర్తులకు రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకొని మూలమూర్తికి వెండి కవచాలను అలంకరించారు. ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉద్యోగోన్నతుల్లో ఇష్టారాజ్యం

- జీజీహెచ్‌లో ప్రమోషన్ పోస్టుల్లో పక్షపాతం
- ఏళ్ల తరబడి కొన్ని పోస్టులు భర్తీ చేయని వైనం
- అధికారుల తీరుతో నష్టపోతున్న ఉద్యోగులు
- అధికారుల పనితీరుపై విమర్శలు



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ పోస్టుల భర్తీ ప్రక్రియలో ఆస్పత్రి అధికారులు పక్షపాతం చూపిస్తున్నారని పలువురు ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఐదు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కేవలం పదిరోజుల క్రితం ఖాళీ అయిన ఎక్సరే అటెండెంట్ పోస్టును ప్రమోషన్ ద్వారా భర్తీ చేసేందుకు ఆస్పత్రి అధికారులు ఈనెల 23న నోటిఫికేషన్ విడుదల చేయటంతో పలువురు ఉద్యోగులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

అర్హత ఉండీ నో ప్రమోషన్

గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో కొన్నింటిని ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. సుమారు ఐదు సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయకుండా ఆస్పత్రి అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావటం లేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ ఇచ్చి మిగతా అభ్యర్థులకు ప్రమోషన్ ఇవ్వకుండా మిన్నకుండిపోవటంపై పలువురు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. జిల్లా కలెక్టర్‌కు, ఉద్యోగుల స్పందన కార్యక్రమాల్లో సైతం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఆస్పత్రి అధికారులు జూనియర్ అసిస్టెంట్ పోస్టులను ఎందుకు భర్తీ చేయటం లేదనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

2021 నుంచి భర్తీ లేదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో ఏ ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉంచకుండా జీరో వేకెన్సీ విధానంలో అన్ని పోస్టులను భర్తీ చేయాలని పదే పదే చెబుతోంది. ప్రమోషన్ ద్వారా లేదా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా ప్రతి ఒక్క ఖాళీ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది. అయినా ఆస్పత్రి అధికారులు ఏళ్ల తరబడి పోస్టులను భర్తీ చేయకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావటంలేదని పలువురు అర్హత కల్గిన ఉద్యోగులు వాపోతున్నారు. ఆస్పత్రిలో రికార్డు అసిస్టెంట్ పోస్టు 2021 మే నెల నుంచి ఖాళీగా ఉంది. ఈ పోస్టుకు అర్హత ఉన్న నాల్గో తరగతి ఉద్యోగులు ఆస్పత్రిలో ఉన్నారు. అయినా భర్తీ చేయకుండా అర్హత కల్గిన అభ్యర్థులను ఆస్పత్రి అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటూ చుక్కలు చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నాల్గో తరగతి ఉద్యోగుల విషయంలోనే ఇలా..

ఆస్పత్రి అధికారుల తీరుతో పలువురు ఉద్యోగులు కోర్టుకు వెళ్లి ప్రమోషన్ దక్కించుకుంటున్నారు. కోర్టుకు వెళ్లకపోతే తమకు ప్రమోషన్ రాదనేవిధంగా ఆస్పత్రి అధికారులు ప్రవర్తిస్తున్నారని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ముఖ్యంగా నాల్గోతరగతి ఉద్యోగుల ప్రమోషన్స్‌లోనే ఇలాంటి వివక్ష ఎక్కువగా ఉందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఈ విషయంపై దృష్టి సారించి ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రమోషన్ల విషయంలో న్యాయం చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.

త్వరలో భర్తీ చేస్తాం

ఆస్పత్రిలో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టుల జాప్యంపై ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావును 'సాక్షి' వివరణ కోరగా త్వరలోనే రికార్డు అసిస్టెంట్ పోస్టును, జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేస్తామని తెలిపారు.

పల్నాడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు


ప్రారంభానికి సిద్ధమైన వంద పడకల హాస్పిటల్

పిడుగురాళ్ల రూరల్: పల్నాడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. మండలం కామేపల్లి రెవెన్యూ పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ మొదటి దశ సోమవారం ప్రారంభించనున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజ్‌ని ఆదివారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్నాడుకు వైద్యకళాశాల అవసరము ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి కళాశాల మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తొలి బడ్జెట్ సమావేశంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.500 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. 2021లో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ,హాస్పిటల్‌కు శంకుస్థాపన చేశారు. రూ.180 కోట్లతో మొదటి దశగా వంద పడకల హాస్పిటల్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. 2024 సెప్టెంబర్ నాటికి పనులు అన్ని పనులు పూర్తి చేసి మరో 500 పడకల హాస్పిటల్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. 55 వేల ఎకరాల్లో విస్తీర్ణంలో 12 లక్షల చదరపు అడుగుల్లో 600 పడకల హాస్పిటల్, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, లేబొరేటరీలు, ఆపరేషన్ థియేటర్లు, సిబ్బంది నివాస భవనాలు నిర్మాణాలను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీవీజీ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొత్త సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.గఫార్, మార్కెట్ యార్డు చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ సీహెచ్ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరావు, లాయర్ కంభంపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా

విద్యార్థులకు స్వల్ప గాయాలు

వేమూరు: ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి బోల్తా పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వల్పంగా గాయపడ్డారు. కొల్లూరు మండల కేంద్రంలో వివేకానంద పాఠశాలల్లో క్రీడలు నిర్వహిస్తున్నారు. వాటిల్లో పాల్గొనేందుకు తెనాలి వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థులు 21 మంది, ఉపాధ్యాయులు మూడు బస్సుల్లో వెళ్లారు. అక్కడ ఆటలు పోటీలు ముగింపు అనంతరం కొల్లూరు నుంచి తెనాలి బయలు దేరారు. అతి వేగంగా నడపటంతో, వేమూరు పెట్రోలు బంక్ సమీపంలో మలుపు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులో బాలికలు 11 మంది, బాలురు తొమ్మిది మంది, ఉపాధ్యాయులు ముగ్గురు ఉన్నారు. బోల్తా పడిన వెంటనే రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు అద్దాలు పగలు కొట్టి బయటకు తీయడంతో స్వల్ప గాయాలైనట్లు ఎస్‌ఐ తెలిపారు.

మైనారిటీలపై చంద్రబాబుకి వివక్ష

- సీట్ల కేటాయింపులో బయటపడిన వైఖరి
- ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి


ఖాజావలి

లక్ష్మీపురం: మైనారిటీపై చంద్రబాబు వివక్షత మరోసారి సీట్ల కేటాయింపుతో బయటపడిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి ధ్వజమెత్తారు. స్థానిక కంకరగుంట గేటు వద్ద గల రాష్ట్ర సమితి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన పార్టీ పొత్తులో భాగంగా 99 స్థానాల్ని ప్రకటించిన చంద్రబాబు అందులో ముస్లింలకు కేవలం ఒక్కటే కేటాయించడం దుర్మార్గమని ఖండించారు. 2014లో కూడా ఆయన ఒక్క స్థానం మాత్రమే కేటాయించినట్లు గుర్తు చేశారు. అనంతరం ఏర్పడిన మంత్రి వర్గంలో ముస్లింలకు అవకాశం కల్పించలేదని, నాలుగున్నర సంవత్సరాలు ముస్లిం మంత్రి లేకుండానే కొనసాగించారని గుర్తు చేశారు. చివరి ఆరు నెలలు ఎన్నికల ముందు ఫారుక్‌కు శాసన మండలి సభ్యునిగా అవకావమిచ్చి మంత్రి వర్గంలో చోటు కల్పించారని చెప్పారు. గుంటూరులో జరిగిన నారా హమారా... బాబు హమారా సభలో తమ డిమాండ్లు నెరవేర్చాలని ప్లకార్డులు చూపించిన ముస్లిం యువకులపై రాజద్రోహం కేసులు మోపడం సిగ్గుచేటని ఖండించారు. చంద్రబాబు వైఖరి మార్చుకోలేనందును 2024లో జరిగే ఎన్నికలలో మరలా ముస్లిం మైనారిటీలు చంద్రబాబుకు, పవన్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయంలో ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు ముస్లింలకు తగినన్ని స్థానాలు ఇవ్వాలని, లేనిపక్షంలో వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ముస్లింలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారన్నారు. 30 నియోజకవర్గాల పైగా విజయవకాశాలను నిర్ణయించే స్థితిలో ఉన్నారని, వారికి కనీసం 10 స్థానాలైనా కేటాయించాలని ఆయన చంద్రబాబును కోరారు. జనసేన, టీడీపీ పొత్తులో కనీసం 12 సీట్లు ముస్లిం మైనారిటీలకు కేటాయించాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

శ్రేష్ట హాస్పిటల్స్ ప్రారంభం


మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణస్వామి

గుంటూరు మెడికల్: అత్యాధునిక వైద్యసేవలన్నీ ఒకేచోట అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు శ్రేష్ఠ హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్నామని చైర్మన్ డాక్టర్ వై. లక్ష్మణస్వామి అన్నారు. ఆదివారం గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డు డీ మార్ట్ షోరం ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రేష్ఠ హాస్పిటల్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే పనిలేకుండా అన్ని సేవల్ని తమ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున మాట్లాడుతూ గుండె సంబంధిత అన్ని చికిత్సలు తమ ఆస్పత్రిలో ఉన్నాయని చెప్పారు. ఏపీలోనే మొట్టమొదటిసారిగా క్యాథ్‌ల్యాబ్ ఆటోరైట్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ 1.5 టెస్లా ఎంఆర్ఐ, హెచ్‌ఆర్ సీటీ వంటి ఆధునిక రేడియాలజీ స్కానింగ్ మిషన్స్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. అన్ని రకాల రక్తపరీక్షలు ఉన్నాయని తెలిపారు. న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, కార్డియోథొరాసిక్ సర్జరీ, యూరాలజీ, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, క్రిటికల్ కేర్ వైద్య విభాగాలు తమ ఆస్పత్రిలో ఉన్నాయని డాక్టర్ లక్ష్మణస్వామి వెల్లడించారు.


గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి


మలినేని లక్ష్మయ్య మహిళా కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి

ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–2 ప్రిలిమ్స్ రాత పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి గుంటూరు నగరంలోని టీజేపీఎస్ కళాశాలను, జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి వట్టిచెరుకూరు మండలంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల, చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల, ఆంధ్రా ముస్లిం కళాశాలను, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఏసీ కళాశాల, వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వ విద్యాలయాల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు – నగరంపాలెం

జగనన్న వెంటే యువత

- వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చాటి చెప్పండి
- కలసికట్టుగా ఉంటూ పార్టీని మరోసారి గెలిపించుకుందాం
- యూత్‌కు యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపు

కొల్లిపర: రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని, మరోసారి ఇదే అభివృద్ధి, సంక్షేమ పాలన కోసం యువకులు మళ్లీ జగనన్నకు పట్టం కట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్, యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అవుతు రామిరెడ్డి కళాశాల ప్రాంగణంలో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండలి అధ్యక్షుడిగా ఈదా యశ్వంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే శివకుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిద్ధార్థరెడ్డి పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకు ప్రతి ఒక్కరూ పవన్ కల్యాణ్‌ను ప్యాకేజీ స్టార్ అని పిలుస్తుంటే పార్టీ కార్యకర్తలు నమ్మేవారు కారని.. ఇప్పుడు ప్రకటించిన 24 సీట్లు చూసిన తర్వాత నిజమని నమ్మేస్థితికి వచ్చారని తెలిపారు. వైఎస్సార్ సీపీపై పనికట్టుని దుష్ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీతో పాటు కొత్తగా కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వైఎస్సార్ సీపీ యూత్ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించి , ముఖ్యమంత్రిగా మరలా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డితో రెండోసారి కూడా ప్రమాణ స్వీకారం చేయించాలని కోరారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో కొల్లిపర మండలంలో వివిధ రంగాల్లో అభివృద్ధి, సంక్షేమం ఎలా పరుగులు తీసిందో ప్రజలకు యూత్ చాటి చెప్పాలని చెప్పారు. ప్రజల రక్తాన్ని పీల్చే టీడీపీ కావాలో, లేదా ప్రజలకు సంక్షేమాన్ని కల్పించే వైఎస్సార్ సీపీ పాలన కావాలో జనానికి వివరించాల్సిన బాధ్యత కూడా పార్టీ యువతకు ఉందని మార్గదర్శనం చేశారు. తొలుత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి , ఎమ్మెల్యే శివకుమార్ పార్టీ నాయకులతో, యువతతో కలసి దావులూరు అడ్డ రోడ్డు నుంచి భారీ ఎత్తున బైక్ ర్యాలీతో తూములూరు, యాదవపాలెం , దావులూరిపాలెం, కొత్తపాలెం మీదుగా కొల్లిపరలోని అవుతు రామిరెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి చేరుకున్నారు. పార్టీ శ్రేణులు వారిని గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ పద్మావతి, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి , సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఈదా యశ్వంత్‌రెడ్డి , పక్కన యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

ఆర్థికాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అవసరం

ఏపీ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు

కొరిటిపాడు(గుంటూరు): స్థిరమైన ఆర్థికాభివృద్ధి, లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన కోసం ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం చాలా అవసరమని ఆంధ్రప్రదేశ్ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీపురంలోని స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీ చాంబర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మహిళా పారిశ్రామికవేత్తలతో ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం నిర్వహించారు. భాస్కరరావు మాట్లాడుతూ భారతదేశంలో మహిళల ఆర్థిక సహకారం జీడీపీలో 17 శాతం ఉందని, ఇది ప్రపంచ సగటు కంటే తక్కువ అని వెల్లడించారు. వర్క్‌ఫోర్స్‌లో 50 శాతం మహిళల్ని చేర్చుకోవడం ద్వారా భారతదేశం జీడీపీ వృద్ధిని 1.5 శాతం పెంచుతుందని ప్రపంచ బ్యాంక్ నివేదించిందని తెలిపారు. మెకిన్స్ గ్లోబల్ ఇనిస్టిట్యూట్ అంచనా ప్రకారం 2025 నాటికి 68 మిలియన్ల మహిళల్ని శ్రామిక శక్తిలోకి తీసుకురావడం ద్వారా భారతదేశం జీడీపీని యుఎస్‌డీ 700 బిలియన్లకు పెంచగలదని అంచనా వేసిందని పేర్కొన్నారు. దేశంలో 63 మిలియన్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 20 శాతం మహిళల యాజమాన్యం, 22 నుంచి 27 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తోందని వివరించారు. దేశంలోని అన్ని సంస్థల్లో మహిళలకు 20 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. ఈ మహిళా నేతృత్వంలోని ఎంటర్‌ప్రైజెస్‌లో 82 శాతం మైక్రో యూనిట్లు ఏకైక మార్గాలుగా నడుస్తున్నాయని వెల్లడించారు. మహిళలకు సాధికారత కల్పించి, వారిని ఆర్థికాభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో గుంటూరు, ఇతర జిల్లాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలతో గుంటూరులో మహిళా విభాగాన్ని ఒక చాప్టర్‌గా ప్రారంభించేందుకు ఏపీ చాంబర్స్ చొరవ తీసుకుందని వివరించారు. విశాఖపట్నంలోని మహిళా విభాగం 110 మంది మహిళా పారిశ్రామికవేత్తలతో గత రెండు సంవత్సరాలుగా చురుకుగా పని చేస్తోందని తెలిపారు. వ్యాపార మహిళలు, వర్ధమాన వ్యాపారవేత్తలు, నిపుణులు మహిళా అధ్యాయంలో భాగం కావచ్చని కోరారు. కార్యక్రమంలో 40 మంది మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొని, అధ్యాయంలో భాగం కావడానికి ఆసక్తిని కనబరిచారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిత, డాక్టర్ మమత, రాధిక, అపర్ణ, రోజా, పూజ, నీలిమ, శరణ్య పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వెన్నం జ్యోతి సురేఖ, వీసీ తదితరులు

- విలు విద్యలో అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ
- వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో ఘనంగా ముగిసిన విటోపియా- 2024

ఐనవోలు(తాడికొండ): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ అన్నారు. తుళ్లూరు మండలంలోని వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా కొనసాగుతున్న విటోపియా- 2024 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోతి సురేఖ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి ముందుకెళ్లడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు. విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారి ప్రతిభను వెలికితీసేందుకు ఏటా విటోపియా పేరిట వార్షిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలలో పాల్గొని, నైపుణ్యాల్ని వృద్ధి చేసుకునేందుకు వేదికగా మారుతుందని తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యాల్ని ప్రోత్సహించేందుకు, విద్య, పరిశోధనా రంగాలలో తమ విశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారం, విద్యార్థుల ప్రతిభను వివరించారు. ఈ సందర్భంగా సమయ్ రైనా స్టాండప్ కామెడీ అందరినీ అలరించింది. సాయంత్రం జరిగిన ప్రో షోలో జోనిత గాంధీ బ్యాండ్, సలీమ్ అండ్ సులేమాన్ బ్యాండ్, డీజే ప్రోగ్రెసివ్ బ్రదర్స్ బ్యాండ్‌ల సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో వీఐటీ ఏపీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ సుధాకర్ ఇలంగో, విటోపియా స్టూడెంట్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ ఖాదీర్ పాషా, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెరుకూరు ఏకేఎంఆర్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు కరస్పాండెంట్ పత్రా యూలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటేశ్వర్లు, కే పద్మావతమ్మలను ఈనెల 22వ తేదీన సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు పలుమార్లు వివరణ కోరుతూ మెమోలు జారీ చేసినా స్పందించలేదని అందుకే సస్పెండ్ చేసినట్లు వివరించారు. విధుల నుంచి తొలగించిన అనంతరం తమను పాఠశాలలోకి అనుమతించాలని ఉపాధ్యాయుల గేటు వద్ద కూర్చొని తనను ఇబ్బంది పెడుతున్నారని ఆ ప్రకటనలో తెలిపారు.